


గిరిజన విద్యార్థులను అభినందించిన మంత్రి

సాలూరురూరల్ : జెఇఇ మెయిన్స్‌లో మంచి ర్యాంకులు సాధించిన గిరిజన గురుకులాల విద్యార్థులను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అభినందించారు. సీతానగరం మండలం జోగింపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు జెఇఇ మెయిన్స్‌లలో ప్రతిభ కనబరిచారు. ఈసందర్భంగా 137వ ర్యాంక్ సాధించిన ఎస్. నందవర్ధన్ నిహాల్, 900వ ర్యాంక్ సాధించిన ఎస్.అఖిల్, 2864వ ర్యాంక్ సాధించిన పి.జగదీశ్వర్ రావు, జెఇఇ అడ్వాన్స్‌డ్ సెలెక్షన్ ఎంపికైన ఇతర విద్యార్థులందరిని మంత్రి అభినందించారు. విద్యార్థుల కృషి, గురుకులాల నాణ్యమైన బోధన విధానం, తల్లిదండ్రుల ప్రోత్సాహం వలన వీరు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చగలిగారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అన్ని విధాలా తోడుగా ఉంటుందని తెలిపారు.

అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న ఒడిశా

వాటర్ ట్యాంక్ పనులు చేస్తున్న గిరిజనుల తరలింపు
కొటియా పోలీసు స్టేషన్ వద్ద దూళిభద్ర గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల విషయంలో మరోసారి ఒడిశా పోలీసులు దౌర్జన్యాన్ని ప్రదర్శించారు. కొటియా గ్రామాల్లో ఒకటైన దూళిభద్రలో జలజీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను రెండోసారి ఒడిశా పోలీసులు అడ్డుకున్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేస్తున్న దూళిభద్ర గిరిజనులు చోడిపల్లి సుబ్బారావు, చోడిపల్లి నర్సు, పెయింటరింగ్ కొటియా పోలీసులు దౌర్జన్యంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. కొద్ది నెలల క్రితం కూడా అదే వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు, నిర్మాణ సామగ్రితో ఉన్న వ్యాన్‌ను కొటియా పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లిపోయారు. ఇప్పుడు కూడా కొటియా పోలీసులు మరోసారి దూళిభద్ర వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికులను లాక్కెళ్లిపోయారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మాజీ సర్పంచ్ గెమ్మెల భీమ్ అధ్వర్యాన గిరిజనులు కొటియా పోలీసు స్టేషన్‌ వద్ద ఆందోళన చేపట్టారు. పదేపదే ఒడిశా పోలీసులు, అధికారులు అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదని వారు పోలీసు స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

ఏపి ప్రభుత్వ మౌనమే ఒడిశా దూకుడుకు కారణమా?

కొటియా గ్రామాల విషయంలో ఒడిశా ప్రభుత్వం ఎన్ని దౌర్జన్యాలకు, దురాగతాలకు పాల్పడుతున్నా ఏపి ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. వివాదాస్పద గ్రామాల గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా, ఒడిశా దౌర్జన్యంతో నలిగిపోతున్నా ఏపి అధికారులు కిమ్మనడంలేదు. మరోవైపు ఒడిశా ప్రభుత్వం యథేచ్ఛగా కొటియా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతోంది. ఈ పనులను ఏపి అధికారులు, పోలీసులు ఏనాడూ అడ్డుకున్న దాఖలాల్లేవు. ఇటీవల ఎగువ శెంబి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఒడిశా అధికారులు స్థలసేకరణ చేశారు. ఆ గ్రామానికి చెందిన గిరిజనులు సాగు చేస్తున్న భూముల్లో సరిహద్దు రాళ్లు వేయడంతో వారు ఆందోళన చేపట్టారు. సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు ఒడిశా అధికారుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. రెండు రాష్ట్రాల మధ్య అనేక ఏళ్ల నుంచి వివాదాస్పదంగా ఉన్న కొటియా గ్రామాల విషయంలో సుప్రీంకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఒడిశా, ఏపి ప్రభుత్వాలు వివాదాస్పద కొటియా గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుండేవి. గత మూడేళ్లగా ఒడిశా, ఏపి ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడమే ధ్యేయంగా దూకుడు ప్రదర్శిస్తోంది. ఈ దూకుడును అడ్డుకట్ట వేసేందుకు ఏమాత్రం ప్రయత్నాలు జరగడం లేదు.



ఒడిశా అధికారుల తీరుతో నిలిచిపోయిన వాటర్ ట్యాంకు పనులు

అంతుచిక్కని గిరిజన మంత్రి వైఖరి

కొటియా గ్రామాల విషయంలో స్థానిక ఎమ్మెల్యే, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వైఖరి అంతుచిక్కడం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే మూడు సార్లు ఒడిశా ప్రభుత్వం దౌర్జన్యం ప్రదర్శించింది. కొటియా గ్రామాల విషయాన్ని సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లానని గతంలో ఆమె చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ఒడిశా పోలీసులు అధికారులు దౌర్జన్యం ప్రదర్శించి స్థానిక ఎన్నికలను బహిష్కరించాలని కొటియా గ్రామాల ఓటర్లపై ఒత్తిడి పెంచితే ఏపి పోలీసులు, అధికారులు తీవ్రంగా ప్రతిఘటించారు. ఆ సంఘటనతో కొంతవరకు ఒడిశా పోలీసులు, అధికారులు వెనక్కి తగ్గిన పరిస్థితి ఏర్పడింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒడిశా ప్రభుత్వం దూకుడు పెంచింది. కూటమిలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు ఉన్నాయి. ఒడిశాలో బిజెపి ప్రభుత్వం అధికారంలో వుంది. ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో రెండు మిత్ర పక్షాలైన టిడిపి, బిజెపి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా సరిహద్దు గ్రామాల సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

జెఇఇ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు



తోటాడ ప్రీతి, 14వ ర్యాంకు ఆలిండియా ఓపెన్ కేటగిరీ



ఆనంద్‌చక్రవర్తి, 86వ ర్యాంకు ఆలిండియా ఓపెన్ కేటగిరీ



పి.రోహిత్, 93వ ర్యాంకు ఆలిండియా ఓపెన్ కేటగిరీ

ప్రజాశక్తి-బొబ్బిలి, పార్వతీపురంటౌన్ రామభద్రపురం, కొత్తవలస, సీతానగరం, పాలకొండ

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు. పలువురు విద్యార్థులు వందలోపు ర్యాంకు సాధించి సత్తాచాటారు. విజయనగరం జిల్లాకు చెందిన పి.శ్రీహర్ష వర్ధన్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 26వ ర్యాంకు, ఆరంగి సాత్విక్ ఓపెన్ కేటగిరిలో 271వ ర్యాంకు, ఒబిసిలో 36వ ర్యాంకు సాధించాడు. పిహెచ్‌ఎస్ సూర్య కార్తీక్ ఓపెన్ కేటగిరిలో 75వ ర్యాంకు, ఒబిసిలో 29వ ర్యాంకు, బి.మహంతి 459వ ర్యాంకు, పార్వతీపురం పట్టణానికి చెందిన ద్వారపురెడ్డి బలరాంనాయుడు 769వ ర్యాంకు, ఒబిసిలో 120వ ర్యాంకు సాధించాడు. బలరాం నాయుడు తండ్రి ద్వారపురెడ్డి తిరుపతిరావు గ్రేడ్1 కాంట్రాక్టర్ కాగా, తల్లి శకుంతల డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బొబ్బిలిలోని నాయుడు కాలనీకి చెందిన పొట్నూరు కార్తిక్ ఓపెన్ కేటగిరిలో 481వర్యాంకు, కెవి అరవింద్ కుమార్ 494వ ర్యాంకు సాధించారు.

ప్రీతికి 14వ ర్యాంకు

కొత్తవలస మండలం రాజ పాత్రునిపాలెం గ్రామానికి చెందిన తోటాడ ప్రీతి ఆలిండియా 14వ ర్యాంకు సాధించి మండలానికి మంచి పేరు తీసుకొచ్చారు. ఆమె ర్యాంకు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

ఆనంద్‌చక్రవర్తికి 86వ ర్యాంకు

బొబ్బిలికి చెందిన పిటి ఆనంద్ చక్రవర్తి 86వ ర్యాంకు సాధించాడు. రత్నాల నగర్'లో నివాసముంటున్న పి.టీను ఆనంద్ చక్రవర్తి ఓపెన్ కేటగిరీలో 86వ ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. విశాఖలోని నారాయణ విద్యాసంస్థల్లో టెన్త్, ఇంటర్ సెంట్రల్ సిలబస్ పూర్తి చేసిన చక్రవర్తి జెఇఇ మెయిన్స్ లో ఓపెన్ కేతగిరీలో 86వ ర్యాంక్ సాధించగా ఓబిసి కోటలో 12వ ర్యాంక్ సాధించాడు. తండ్రి శ్రీనివాసరావు పారాది పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడుగా, తల్లి అనురాధ పాతపట్నం మోడల్ పాఠశాలలో గణితం ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. బొబ్బిలికి చెందిన బలగ శ్రీచరణ్ ఒబిసి కేటగిరిలో 3885వ ర్యాంకు సాధించాడు.



డి.బలరాంనాయుడు 120వ ర్యాంకు-ఒబిసి



జాగాన యోగీశ్వర్ 135వ ర్యాంకు-ఒబిసి



పాలవలస పవన్‌తేజ 612వ ర్యాంకు -ఒబిసి



నందవర్ధన్ నిహాల్ 137వ ర్యాంకు-ఎస్‌టి



ఎస్.అఖిల్ 900వ ర్యాంకు - ఎస్‌టి

రోహిత్‌కు 93వ ర్యాంకు

మెయిన్స్ ఫలితాల్లో పాలకొండ మండలం అర్థలి గ్రామానికి చెందిన పొగరి రోహిత్ ఆలిండియా స్థాయిలో 93వ ర్యాంకు సాధించాడు. విశాఖపట్నం కెఎం ఆర్ కళాశాలలో ఇంటర్ చదివి 892 మార్కులు సాధించాడు. తండ్రి వెంకటరమణ కాంట్రాక్టర్ కాగా, తల్లి రామలక్ష్మి గృహిణి.

రాజాం మండలం డోలపేటకు చెందిన పాలవలస పవన్ తేజ 99.79 పర్సంటేల్‌తో ఆలిండియా ఒబిసి కోటాలో 612వ ర్యాంకు సాధించాడు. పవన్‌తేజ తండ్రి బిలాస్‌పూర్‌లో రైల్వే లోకోపైలట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఇంటర్ విశాఖలోని ఫిట్‌జి కళాశాలలో చదువుకొని ర్యాంకు సాధించాడు. మన్యం జిల్లా సీతానగరం మండంలోని జోగింపేటలోని ఎపిటిడబ్ల్యుఆర్ ఎక్సలెన్సుకు చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఈ కళాశాలకు చెందిన ఎస్.నందవర్ధన్ నిహాల్ 98.4 పర్సంటేల్‌తో ఎస్‌టి కేటగిరిలో 137వ ర్యాంకు సాధించాడు. ఎస్.అఖిల్ 93.15 పర్సంటేల్‌తో 900వ ర్యాంకు సాధించాడు. పార్వతీపురం జిల్లాకు చెందిన టి.మనోహర్ 328వర్యాంకు సాధించాడు.

రామభద్రపురం మండలం ఆరికతోట గ్రామానికి చెందిన జాగాన యోగీశ్వర్ ప్రతిభ కనబరిచాడు. 99.95శాతం పర్సంటేల్‌తో ఒబిసి విభాగంలో 135వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దేశానికి ఉపయోగపడేలా కృషి చేయడమే తన ధ్యేయమని ఈ సందర్భంగా యోగీశ్వర్ తెలిపారు. యోగీశ్వర్‌ను గ్రామస్తులు అభినందించారు.

స్వచ్ఛ పార్వతీపురం లక్ష్యంగా ముందుకు

జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా

ప్రజాశక్తి - సీతానగరం

స్వర్ణ ఆంధ్రా, స్వచ్ఛ పార్వతీపురం లక్ష్యంగా ముందుకు సాగుదామని జిల్లా ప్రత్యేక అధికారి డా. నారాయణ భరత్ గుప్తా పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని స్థాపించవచ్చని ఆయన వివరించారు. సీతానగరంలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత స్వచ్ఛతా ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎమ్మెల్యేతో కలిసి మొక్కలను నాటారు. చీపురును చేతపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత కేవలం పారిశుధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదన్నారు. డయేరియా, మలేరియా, చికెన్ గునియా తదితర రోగాల బారిన పడకుండా ఉండాలంటే పరిశుభ్ర వాతావరణాన్ని నిర్మించుకోవాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని, కావున ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని సూచించారు. ఘన, ద్రవ వ్యర్థాలను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లను అందివ్వాలన్నారు. అనంతరం మండలంలోని పెద బోగిలి చెత్త నుంచి సంపద కేంద్రంలో వర్మీ కంపోస్ట్ ఉత్పాదకతను కలెక్టర్ పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్ల పనితనాన్ని అభినందిస్తూ, దుశ్శాలువతో సత్కరించి, వారితో కలిసి టీ తాగారు. ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి నుంచి చెత్తను సేకరించడం ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు చెత్త నుంచి సంపద లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తెరోజమ్మ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, తహశీల్దార్ కె.ప్రసన్న కుమార్, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, డిపిఒ టి.కొండలరావు, డిఎల్‌పిఒ ఎం.నాగభూషణరావు , జిల్లా రిసోర్స్ పర్సన్ ఎ.గణపతి, ఇఒపిఆర్‌డి వర్మ , తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జిల్లా ప్రత్యేకాధికారి, కలెక్టర్, ఎమ్మెల్యే

రైతులకు ఆధునిక వ్యవసాయం పట్ల అవగాహన : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల పట్ల పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవడమే కాకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక దిగుబడులు, రాబడిని సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండల వ్యవసాయ పరిశోధనా, విస్తరణ సలహా మండలి సమావేశం స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో శనివారంకలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జ్యోతి ప్రజ్వలన చేసి సెమినార్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా 51 శాతం వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, 70 శాతం జనాభా వ్యవసాయ అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నట్లు చెప్పారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన వ్యవసాయ అనుబంధ రంగాలు ఒక యూనిట్‌గా పనిచేయాలని, తద్వారా 16 శాతం వృద్ధిని సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కొన్ని సంస్థలు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో గతేడాది రాగి పంటను విస్తరించడం, కంది, మొక్కజొన్న పంటలను ప్రోత్సహించడం వంటి అనేక కార్యక్రమాలను చేపట్టి విజయవంతమయ్యామన్నారు. ఫారం పండ్స్ ఏర్పాటుకు రైతులు ముందుకు రావాలని, పశుగ్రాసం పెంచుకోవడానికి కూడా ఉపాధిహామీలో అవకాశం ఉందని, తద్వారా రూ.39వేల వరకు ఆదాయం లభిస్తుందన్నారు. శాస్త్రవేత్తలు చేసిన ప్రయోగాలు రైతులకు చేరాలని, ప్రకృతి వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడిని సాధించిన జిల్లాగా నీతి అయోగ్ మన జిల్లాను ఎంపిక చేసిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. జీడి, పసుపు, ఆయిల్ పామ్ పంటలను జిల్లాలో మరింత విస్తరించాలన్నారు. బిందు సేద్యం యూనిట్లపై గిరిజన రైతులకు శత శాతం, ఇతరులకు 90 శాతం వరకు సబ్సిడీ ఉందని, కావున వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గిరిజన రైతులు ఎఫ్‌బిఒలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఐదు ఎకరాలకు ఒక బోర్ వెల్‌ను 50శాతం సబ్సిడీతో ఐటిడిఎ ట్రైబల్ సబ్ ప్లాన్ ద్వారా మంజూరు చేస్తామన్నారు. చిరుధాన్యాలను జిల్లాలో ప్రోత్సహించేలా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులను కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పార్వతీపురం, వీరఘట్టం, సాలూరు ప్రాంతాల్లో కోల్ట్ స్టోరేజీలు ఉన్నాయని, అద్దె ప్రాతిపదికన వాటిని వినియోగించుకోవచ్చని రైతులకు వివరించారు. ఏనుగుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో వాటికి శాశ్వత పరిష్కారం లభించవచ్చని అన్నారు. చెక్ డ్యాములు, కాలువల మరమ్మతు పనులను మరో రెండు మాసాల్లో ప్రారంభించి పూర్తిచేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, చింతపల్లి ప్రచురించిన ఉన్నత పర్వత శ్రేణి, గిరిజన ప్రాంతాల్లో వలిసేల సాగు సమగ్ర యాజమాన్యం బుక్ లెట్, ఎత్తైన గిరిజన ప్రాంత రైతులకు అనుకూలమైన సేంద్రీయ ఎరువులు, సేంద్రీయ వ్యవసాయంలో జీవన ఎరువుల ప్రాముఖ్యత వంటి కరపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. రస్తకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రచురించిన పశుగ్రాస రకాలు - సాగు విధానాలు బుక్ లెట్, మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు బుక్ లెట్, నువ్వుల పంటలో అధిక దిగుబడికి మేలైన యాజమాన్యం కరపత్రాన్ని, సీతంపేట వ్యవసాయ పరిశోధనా స్థానం, పాడేరు ఏరువాక కేంద్రాలు రచించిన గిరిజన ప్రాంతాలకు అనువైన పచ్చిరొట్ట ఎరువులు, వాటి ప్రాముఖ్యత, ప్రొడక్షన్ టెక్నాలజీ ఆన్ ఆల్ సీడ్ క్రాప్స్ కరపత్రాలను ఇతర శాస్త్రవేత్తలు, అధికారులతో కలిసిన కలెక్టర్ విడుదల చేశారు. సమావేశంలో ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పివి సత్యనారాయణ, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎ.అప్పలస్వామి, ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ జి.శివనారాయణ, జిల్లా ఉద్యానవన శాఖాధికారి బి.శ్యామల, ఎపిసిఎన్ఎఫ్ అధికారి షణ్ముఖ, ప్రాజెక్ట్ వ్యవసాయ అధికారి జి.శ్రీనివాసరావు, కెవికె శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, ఎన్.జి.ఓలు, ఇతర అధికారులు , రైతులు తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

స్కూళ్ల మూసివేతను విరమించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

నూతన విద్యా విధానం పేరుతో పాఠశాలలు మూసివేసే ప్రక్రియను విరమించుకోవాలని పేదలకు విద్యను దూరం చేయొద్దని సిపిఎం నాయకులు బొద్దాన భానుమూర్తి, వై.మన్మథరావు అన్నారు. మండలంలోని పలగరలో గల గుడివాడ కాలనీలో "మనఊరు బడిని" రక్షించుకుందాం పేరిట సిపిఎం ముద్రించిన గోడపత్రికను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం వల్ల డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విజయవంతంగా నడుస్తున్న యుపి పాఠశాలలను మూసేసి 3,4,5 తరగతులను మోడల్ స్కూల్ పేరుతో పాఠశాలలను విలీనం చేయడం మంచిది కాదన్నారు. ఈ విలీనం వల్ల పాఠశాలల మధ్య దూరం పెరిగి డ్రాపౌట్స్ పెరుగుతాయని అన్నారు. ఈ విధానం వల్ల ప్రాథమిక విద్య పూర్తిగా బలహీనపడే ప్రమాదం ఉందని, కావున ప్రజలకు అసౌకర్యంగా ఉండే పద్ధతులు మార్చుకొని ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం రెండింటిని సమాంతరంగా నెలకొల్పాలని డిమాండ్ చేశారు. గుడివాడ నిర్వాసితుల కాలనీలో పిల్లలను తరలించొద్దని కోరారు. విద్యా విధానంలో తీసుకొస్తున్న మార్పులను శాస్త్రీయబద్ధంగా ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు, లేనిచో పాఠశాలలను కాపాడుకునేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యపర్చి ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజల అధిక సంఖ్యలో పాల్గొన్నరు.



మన ఊరు బడిని రక్షించుకుందాం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పలగర గ్రామస్తులు

భూదేవిని మార్చాల్సిందే

పరిశీలకుల ముందు టిడిపి శ్రేణుల ఆక్రోశం

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి పడాల భూదేవిని వెంటనే తప్పించాలని టిడిపి శ్రేణులు పార్టీ పరిశీలకులు హర్షవర్ధన్, కలమట సాగర్ ముందు ఆక్రోశం వెల్లగక్కారు. శనివారం అన్నవరం జంక్షన్ దగ్గర ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీకి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఉందని తెలుసుకొని నాలుగు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరై పరిశీలకుల ముందు తమకు కలుగుతున్న ఇబ్బందులను ఏకరు పెట్టారు. పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో వైసిపి పనిచేసిన వారికి ఇన్‌ఛార్జి అనుకూలంగా పనిచేస్తున్నారని, దీనివల్ల నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు వ్యతిరేకంగా వారంతా పనిచేశారని, ఇప్పుడు తామే పార్టీ నాయకులమని అనడం బాధ కలిగిస్తుందన్నారు. ఎవరు పార్టీ కోసం పనిచేశారో నాయకులు గ్రహించాలన్నారు. 20ఏళ్ల నుంచి పార్టీ జెండా పట్టుకుని ఉన్న నాయకులకు, కార్యకర్తలకు విలువ లేదన్నారు. దీనిపై భూదేవి సమాధానం చెప్పాలన్నారు. ఇటీవలే వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ పదవులు కూడా వైసిపికి పని చేసిన వాళ్లకే వచ్చాయన్నారు. దీనివల్ల పార్టీకి తీరని నష్టం జరుగుతుందన్నారు. దీనిపై భూదేవి సమాధానం చెప్పాలన్నారు దీంతో గందరగోళ వాతావరణం నెలకొంది. పరిశీలికులు హర్షవర్ధన్ మాట్లాడుతూ ఈ విషయాలు చెప్పడానికి ఇది వేదిక కాదని, మరోసారి మాట్లాడాలని, ముఖ్య నాయకులను మాత్రమే ఈ సమావేశానికి పిలిచామని చెప్పడంతో కార్యకర్తలు మరింత అసహనానికి లోనయ్యారు. మరి తమ బాధను ఎవరితో చెప్పుకోవాలని ఎక్కడ ప్రస్తావించాలని పరిశీలకులను నిలదీశారు. దీంతో గందరగోళ వాతావరణం చోటు చేసుకుంది. సమావేశం అర్థాంతరంగా ముగియడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పరిశీలకులను చుట్టుముట్టారు. భూదేవిని పార్టీ నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. భూదేవికి వ్యతిరేకంగా ర్యాలీ కూడా చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, నాయకులు ఉదయ భాస్కర్, జాడ శ్రీధర్, తేజోవతి, పొదిలాపు కృష్ణమూర్తి, గంట సంతోష్ కుమార్, గండి రామినాయుడు ఆనందరావు తదితరులు ఉన్నారు.



నియోజకవర్గ పరిశీలకులను నిలదీస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఉపాధిపై దొంగదెబ్బ



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ఒకప్పుడు కమ్యూనిస్టుల చొరవతో ఏర్పడిన ఉపాధి హామీని నేటి ప్రభుత్వాలు దొంగదెబ్బ తీస్తున్నాయి. అందుకే తొలుత నీడు, నీరు, వేసవి అలవెన్సులు లేకుండా చేసి, తాజాగా నిధుల తగ్గింపు, వేతనాల బకాయి పెంపు వరకు తీసుకెళ్లున్నాయి.' ఇది ఉమ్మడి విజయనగరం జిల్లాలో వినిపిస్తున్న పబ్లిక్ టాక్. పార్వతీపురం మన్యం జిల్లాలోని ఉపాధి కూలీలు మరో అడుగు ముందుకు వేసి మూడు రోజుల క్రితం ఏకంగా ఆందోళన బాటపట్టారు. దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన టిడిపి - జనసేన కూటమి ప్రభుత్వం నవ్విపోదురుగాక నాకేంటి అన్నట్టుగా వ్యవహరిస్తోంది. దీంతో, కూలీలను కూడా ముందుకు నడపలేని దుస్థితిలో కాదు.... కాదు... దిగజారుడు తనంతో డబుల్ ఇంజిన్ సర్కారు ఉందన్నది వేరేగా చెప్పనక్కర్లేదు. అసలే విజయనగరం జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. వ్యవసాయ ఆధారిత జిల్లా అయినా తగిన సాగునీటి వనరులు లేవు. ఈ నేపథ్యంలో 2005లో కమ్యూనిస్టుల ఒత్తిడితో కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ చట్టం ప్రకారం ఏడాదిలో వంద రోజులపాటు పని గ్యారెంటీ కల్పించాల్సివుంది. అధికారులు లేదా ప్రభుత్వ యంత్రాంగానికి నచ్చినప్పుడు కాదు సుమా..! అడిగిన వారం రోజుల్లో పని కల్పించాలి. పక్షం రోజుల్లో కూలి చెల్లింపులు జరగాలి. ఈ నిర్దిష్టమైన కాలపరిమితిలో పని కల్పించలేకపోతే ప్రభుత్వ యంత్రాంగమే కూలీలకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు కూలీలు, న్యాయ స్థానాలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వుంటుంది. ఈ విధమైన చట్టం విజయనగరం ఉమ్మడి జిల్లాకు చక్కటి వరంలా ఉపయోగపడింది. అప్పటి వరకు జిల్లాలో లెక్కకు మించిన వలసలు ఉండేవి. కానీ, చట్టం ఏర్పడ్డాక కూలీలు, వ్యవసాయ కార్మికులతోపాటు పేద, మధ్యతరగతి రైతులు, వృత్తిదారులకు చన్నీళ్లకు, వేడినీళ్లు మాదిరిగా ఉపయోగపడింది. జిల్లాలో 3.84లక్షల కుటుంబాలు కేవలం ఈ పనులపై ఆధారపడుతూ జీవనం సాగిస్తున్నారు. బహుశా అందుకేనేమో పనిదినాలు ఉపయోగించుకోవడంలో దేశానికే ఆదర్శంగా నిలిచేది. ఇందుకు గుర్తింపుగా ఎన్నోసార్లు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులు కూడా జిల్లాను వరించాయి. మరో మాటలో చెప్పాలంటే కరోనా వంటి కష్టకాలంలో కూడా కూలీల జీవనానికి ఊపిరి పోసిన చట్టం ఇది. ఈనేపథ్యంలో ఏడాదికి 200రోజులు పని, రూ.600 కనీస వేతనం వచ్చే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించాలనే ఒత్తిడి దేశ వ్యాప్తంగాను, ముఖ్యంగా మన జిల్లా నుంచి పెరిగింది. ఇటువంటి చట్టానికి బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడే తూట్లు పొడిచేందుకు ప్రయత్నించింది. అందులో భాగంగానే అప్పటి వరకు పని ప్రదేశాల్లో నీరు, నీడ కల్పన రద్దుచేసింది. టెక్నాలజీని ఉపయోగిస్తున్నా మన్న పేరుతో రకరకాల ఆన్‌లైన్ పద్ధతులు, సాఫ్ట్‌వేర్లు ఉపయోగించి కూలీల శ్రమకు తగ్గవేతనం రానీయకుండా చేసింది. అంతటితో ఆగకుండా వేసవి అలవెన్సులు, గుణపాం, పార, గమేలాల సరఫరాను నిలిపివేసింది. వాటిని సొంతంగా తెచ్చుకున్నవారికి అద్దెలు ఎగ్గొట్టడం మొదలెట్టింది. ఈ చట్టానికి నిధుల కేటాయింపు కూడా తగ్గించింది. రెండు పూటలా పనిచేస్తే తప్ప, కంప్యూటర్లు హాజరు తీసుకోని విధంగా సాఫ్ట్‌వేర్‌లను రూపొందించారు. పని నుంచి దూరం చేసేందుకు కేంద్ర ఇన్ని విన్యాసాలు చేసినా కూలీలు తాము నమ్ముకున్న నేల తల్లిని, మట్టి పనిని వదులుకోలేదు. దీంతో, మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి ఉపాధి హామీని నీరుగార్చేందుకు వేతన బకాయిలకు ఒడిగట్టింది. దేశ వ్యాప్తంగా రూ.21వేల కోట్ల బకాయి ఉండగా మన జిల్లాలో గడిచిన 100రోజుల్లో 32వేల పనిదినాలకు సంబంధించిన రూ.67.51కోట్ల మేర బకాయి ఉంచేసింది. ఇలా ఉపాధి హామీ చట్టాన్ని ఉపాధి పథకంగా మార్చేయడంతో కూలీలు తమ హక్కులన్నీ కోల్పోతున్నారు. పనిలో ఒత్తిడి పెంచినప్పటికీ అందుకు తగ్గ ఫలితం రానీయకుండా నిబంధనలు మరింత కఠిన తరం చేసింది. ఈనేపథ్యంలో రాష్ట్రంలో మన జిల్లాలోని కూలీల సగటు వేతనం రూ.164లకు దిగజారిపోయింది. కార్మికులల్లో అశాంతి, అసహనం తీవ్రతరమౌతున్న నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం ఆధ్వర్యాన వేతన బకాయితోపాటు నీరు, నీడ సదుపాయాలు పునరుద్ధరించాలని, వేధింపులు అపాలని, తగినంతగా నిధులు కేటాయించాలని, పనికి తగ్గ వేతనం అందించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి కూలీలు ఇరు జిల్లాల్లోనూ తమ ఆందోళన తీవ్రతరం చేసేందుకు సన్నద్ధమౌతున్నారు.

మండుటెండలో ఉపాధి పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో వేతనదారులు మండుటెండలోనే ఉపాధి పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎండల తీవ్రతంగా ఉండడంతో కనీసం తలదాచుకునేందుకు నీడ కూడా లేకపోవడంతో ఎండలో మగ్గి పనులు చేస్తున్నారు. శనివారం మండలంలోని యు వెంకంపేట పంచాయతీ పరిధి వెంకమ్మ సాగరంలో ఆయా ప్రాంతాల నుండి వచ్చిన వేతనదారులు ఎండ తీవ్రతను తట్టుకోలేక తీవ్ర అవస్థలకు గురయ్యారు. అధికారులు స్పందించి ఉపాధి పనులు జరిగిన చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తను ఆదుకోండి

ప్రజాశక్తి - కొమరాడ

కొమరాడకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఒడిసి జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకృష్ణ తదితరులు మండల కేంద్రంలో ప్రభుత్వ సహాయం లేక జీడి పరిశ్రమను ప్రారంభించలేకపోతున్న రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ బొమ్మలి వినోద్ జీడి పరిశ్రమను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు జీడి పరిశ్రమ స్థాపనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేస్తాం.. తగిన ఆసరా కల్పిస్తామని చెబుతున్న జిల్లాకు చెందిన ఆయా శాఖాధికారులు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చిన వారికి ఆసరా కల్పించకపోవడం అన్యాయం అన్నారు.

ఘనంగా సిఎం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏపి సిఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి ఆట వస్తువుల వితరణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం మండల భవిత కేంద్రం చిన్నారులకు ఆటలు ఆడుకునేందుకు అవసరమైన ఆట వస్తువులను శనివారం బొబ్బిలికి చెందిన చైల్డ్ ఇంపాక్ట్ ఇన్ ఏటిటి ఫౌండేషన్ చైర్మన్ డి రాజా వర్మ అందజేసినట్లు సహిత విద్య కోఆర్డినేటర్ భానుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక వికాసాన్ని పెంపొందించడానికి సరైన ఆరోగ్య అవసరాలను గుర్తించి భవిత సెంటర్‌కు జారుడుబల్ల, ఉయ్యాల, ర్యాంపింగ్ పరికరాలను అందించామని తెలిపారు.

24 లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో వ్యవసాయ పరికరాలు కావాల్సిన గిరిజన రైతులు ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎ. సిహెచ్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్‌కు వెయ్యి సబ్సిడీ, పవర్ టిల్లర్‌కు లక్ష రూపాయలు సబ్సిడీ, పవర్ వీడర్, పవర్ స్ప్రేయర్స్, ట్రాక్టర్ పరికరాలకు 50 శాతం రాయితీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలని అన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

కొమరాడ మండలం పరశురాంపురం గ్రామానికి చెందిన రఘుమండల పకీరు నాయుడుకు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సిఎం సహాయ నిధి నుంచి రూ.2,53,203 ఆర్థిక సహాయం అందించారు. పకీరు నాయుడు అనారోగ్యానికి గురైన విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో సిఎం సహాయనిధి నుంచి అందజేశారు.

ఘనంగా రన్‌ఫర్ జీసస్ ర్యాలీ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల రావాడ జంక్షన్ వద్ద ఉన్న గుడ్ సమారిటన్ లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ డి.రాజు, పరజపాడు పాస్టర్ తిమోతి ఆధ్వర్యంలో శనివారం ఈస్టర్ పండగ సందర్భంగా కురుపాంలో గల వైరిచర్ల కాలనీ, శోభలత దేవి, ప్రధాన రోడ్డు, బ్యాంక్ వీధి, ప్యాలస్ రోడ్డు మీదుగా రన్ ఫర్ జీసస్ స్లోగన్స్ చేస్తూ శాంతియుతంగా క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘ పెద్దలు డి. ప్రదీప్, రాజారత్నం, కోట సుందర సుదర్శన్, యవ్వనస్తులు అశోక్, సాగర్, హదర్ష, హవీలా, ప్రణీత్, మణీత్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - సీతంపేట

సీనియర్ పాత్రికేయులు పసుపురెడ్డి లోకేశ్వరరావు తండ్రి పసుపురెడ్డి కామేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ లోకేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ కన్వీనర్ హిమరక పవన్, కూటమి నాయకులు హిమరక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను గుర్తించేందుకు సర్వే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని వివిధ గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేయడం జరుగుతుందని మండల పరిధిలోని కొత్తూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల సముదాయం సిఆర్‌పి బోను రామకృష్ణ తెలిపారు. మండలంలోని రావుపల్లిలో బడి బయట గల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఆర్‌పి రామకృష్ణ మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు గ్రామాల్లో సర్వే చేపట్టామన్నారు. ఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామాల వారీగా బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలు ప్రారంభమైన అనంతరం పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. ఈ సర్వేలో అంగన్వాడీ వర్కర్ చింతల అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు భవనం పీసా కమిటీ వశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లోవముత్తా ప్రాంతంలో గల గొరడలో పదేళ్లుగా కెనరా బ్యాంకుకు పైసా కూడా అద్దె చెల్లించకుండా గిరిజనులకు చెందిన కమ్యూనిటీ భవనంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో నేడు పీసా కమిటీకి అధికారులు అప్పగించారు. ఈ నేపద్యంలో ఏప్రిల్ నుంచి ప్రతినెలా రూ.6800 అద్దె చొప్పున గొరడ పీసా కమిటీ సభ్యులకు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, గొరడ గ్రామస్తులు శనివారం పీసా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గతంలో ఐఫాడ్ నిధులతో గొరడలో కమ్యూనిటీ భవనం నిర్మించారని, అయితే ఆ భవనం గిరిజనుల అవసరాలకు ఉపయోగపడకుండా పదేళ్ల క్రితం కెనరా బ్యాంకు ఏర్పాటు చేశారని అన్నారు. ఈ విషయమై పలుమార్లు ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్లామని, ప్రస్తుతానికి తమ కోరిక నెరవేరిందని అన్నారు. కెనరా బ్యాంకు వాళ్లు ఇచ్చిన అద్దెతో పీసా కమిటీ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి ఆ నిధులు ఉపయోగిస్తామని అన్నారు.

నేరాలు ఘోరాలు

పట్టపగలే దొంగతనం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని పెద్ద బొండపల్లి గ్రామంలో ఉపాధి వేతన దారు ఇంటిలో పట్టపగలే దొంగలు పడి నగదు, బంగారం దోచుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దింటి వెంకట నాయుడు దంపతులు ఉపాధి పనులు నిమిత్తం ఉదయం బయటకు వెళ్లి తిరిగి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండడంతో అనుమానించి ఇంటిలో పరిశీలించారు. బీరువాలో నుంచి నిర్మాణం నిమిత్తం ఉంచుకున్న లక్ష నగదు, ఎనిమిది తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

పెద్ద వంగరలో ఎక్సైజ్ దాడులు

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని పెద్ద వంగరలో ఎక్సైజ్ శాఖ శనివారం దాడులు నిర్వహించింది. 500 లీటర్లు బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. నవోదయం 2.0లో భాగంగా సారా నిర్మూలనకు అందరూ కృషి చేయాలని సిఐ జై భీమ్ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ కావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు బాగుంటేే మనం బాగుంటాం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మన చుట్టు పక్కల పరిసరాలు బాగుంటే మనం బాగుంటామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. స్వర్ణంధ్రా-స్వచ్ఛంధ్రాలో భాగంగా మంత్రి శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేసిన స్వర్ణంధ్రా-స్వచ్ఛంధ్రాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పిల్లల ఉజ్వల భవిష్యత్ తల్లిదండ్రులపైనే ఉందని, వారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఇది ప్రజా ప్రభుత్వమని, వారికి ఎటువంటి అవసరాలున్నా కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. ప్రతి మూడో శనివారం మన ఇళ్లు, పని చేసే కార్యాలయాలతో పాటు చుట్టుపక్కల శుభ్రపరచుకోవాలని కోరారు. స్వచ్ఛంధ్రాలో భాగంగా ఈ-వ్యర్థాల సేకరించి వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడం ద్వారా సంపద సృష్టించడం ద్వారా జిల్లాకు అదనపు ఆదాయం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎన్జీఓలు, కార్పొరేట్ సంస్థలు, విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

ఇ-వ్యర్థాలను శాస్త్రీయంగా రీసైక్లింగ్ చేయాలి : కలెక్టర్

పార్వతీపురం : స్థానిక కలెక్టరేట్‌లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని వివిధ విభాగాలలో ఉన్న ఇ-వ్యర్థాలను మున్సిపల్ కార్యాలయ చెత్త సేకరణ వాహనంలోకి కలెక్టర్ డంప్ చేయించారు. ఈ వ్యర్థాలను సరైన రీతిలో తొలగించి రీసైక్లింగ్ చేయించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలే కాకుండా ప్రైవేటు కార్యాలయాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు, గృహాలలో వినియోగించకుండా ఉండే వ్యర్థాలను గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు. ఇ-వ్యర్థాలపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, కలెక్టర్ కార్యాలయంలోని వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ -వేస్ట్ సేకరణ చేపట్టేందుకు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాశ్ నారాయణ, టిడిపి కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ మేనేజర్, ఎఇలు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, ఆర్ఐలు, శానిటేషన్ సెక్రెటరీలు, మేస్త్రీలు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సెక్రెటరీలు, మెప్మా సిబ్బంది పొదుపు సంఘాలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



సీతంపేట: ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎల్‌డిఒ గోపాలకృష్ణ

కురుపాం : అటవీ శాఖ రేంజర్ గంగరాజు ఆధ్వర్యంలో కురుపాంలో స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆ కార్యాలయంలో మొక్కలు నాటి అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఈ వేస్ట్ కలెక్షన్, సింగల్యాస్, ప్లాస్టిక్ ,నీరు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. కురుపాం మేజర్ పంచాయతీ ఈవో వై. వెంకట నాయుడు ఆధ్వర్యంలో సచివాలయం నుంచి పలు వీధుల్లో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర నినాదాలతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిసరాలు పరిశుభ్రంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా మండలంలోని దుమ్మంగి పంచాయతీ గుణద గ్రామ గిరిజనులు ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ పాలక క్రాంతికుమార్, ఎంపిటిసి కడ్రక మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామాల్లో పరిశుభ్రత వాతావరణం ఏర్పాటుకు యువత ముందుకు రావాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నాగరాజు, సచివాలయం, ఉపాధిహామీ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్ వాడి సిబ్బంది, యువత, మహిళలు పాల్గొన్నారు. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ సొంటేన రాజేష్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లే కార్డులు పట్టి నినాదాలు చేస్తూ స్వచ్ఛ ఆంధ్రపై పాఠశాల నుంచి ఆర్టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. లక్కగూడలో కురుపాం ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి ఆధ్వర్యంలో గ్రామస్తులు స్వచ్ఛ్ ఆంధ్ర -స్వర్ణాంధ్రపై ర్యాలీ నిర్వహించారు.

వీరఘట్టం : స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా చెత్త సంపద కేంద్రం వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పి.వీర్రాజు, ఇఒ బి కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, జామి సింహాచలం తోపాటు మేజర్ పంచాయతీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీతంపేట: సీతంపేట పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ వ్యర్థాలపై అవగాహన ర్యాలీను శనివారం నిర్వహించారు. మానవహారం చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. డివిజనల్ డెవలప్మెంట్ అధికారి గోపాలకృష్ణ, స్థానిక ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్పంచ్ కళావతి మొక్కలు నాటారు. శంబాం సర్పంచ్ నిమ్మక తిరుపతిరావు, కుడ్డపల్లిలో పంచాయతీరాజ్ కార్యదర్శి పాపారావు, ఐటిడిఎలో ఎఎంఒ కోటిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణారావు, డిఎల్‌పిఒ రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బి. రామకృష్ణ, ఎఇ సత్యం, ఎంఇఒ ఆనందరావు, ప్రధానోపాధ్యాయులు చందర్రావు, వైద్యాధికారి రాజేష్ తదితరుల పాల్గొన్నారు.

పాచిపెంట: మండలంలోని పాంచాలిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం సర్పంచ్ గూడెపు యుగంధర్ ఆధ్వర్యాన నిర్వహించారు. తొలుత ముందుగా రైతు సేవా కేంద్రం వద్ద మొక్కలు నాటారు. అనంతరం ఎంపిటిసి ఉమామహేశ్వరరావుతో కలిసి గ్రామ సభను నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి తిరుపతిరావు, విఎఎ ఈదిబిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో మంత్రి సంధ్యారాణి


సాలూరు: చీపురుతో క్లీన్ చేస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

పార్వతీపురంరూరల్: మండలంలోని వెంకంపేట గ్రామంలో ప్రత్యేకాధికారి ఎం సుధారాణి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ర్యాలీ మానవహారం ప్రతిజ్ఞ తరువాత ఎస్‌డబ్ల్యూపి షెడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిటిసి, ఎంపిడిఒ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : స్థానిక పిహెచ్‌సి స్వచ్ఛ ఆంధ్రా- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు పాల్గొన్నారు. ఆసుపత్రి ఆవరణలను పరిశీలించి సిబ్బందితో కలిసి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అనంతరం అక్కడ మొక్కలు నాటి నీరు పోశారు. ఆసుపత్రిలో నిరుపయోగమైన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, విద్యుత్ ఉపకరణాలను సేకరించారు. వాటిని పరిశీలించి తగు అధికారికి పద్ధతుల ద్వారా డిస్పోజ్ చేయాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు, వైద్యాధికారి డాక్టర్ ఎస్.సంతోష్ కుమార్, ఎంపిడిఒ జి.పైడితల్లి, ఇఒపిఆర్‌డి గోపాలరావు, డెమో యోగీశ్వరరెడ్డి, ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, ఆరోగ్య పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్రా- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శేఖరం, ఇఒపిఆర్‌డి నల్లి ధర్మారావు, భద్రగిరి ఇంచార్జి సిడిపిఒ రాజ్యలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పరీక్షలు- మార్కులే జీవితమా?'

ప్రజాశక్తి - కురుపాం

పరీక్షలు, మార్కులే జీవితమా అనే అంశంపై 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులకు శనివారం మండల కేంద్రంలోని కెజిబివిలో ప్రిన్సిపాల్ ఐ.కిరణకుమారి ఆధ్వర్యంలో జిల్లా కెరియర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్ప్ కౌన్సిలర్, రిసోర్స్ పర్సన్ రేవల్ల అనంతరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎవరూ కూడా మార్కులు తక్కువ వచ్చాయని ఫెయిలయ్యామని అధైర్య పడకుండా, తొందరపాటు నిర్ణయాలు తీసుకొని జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన తరువాత ఏ కోర్సులు తీసుకుంటే ఏటువంటి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల కెజిబివి పాఠశాల విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: భామిని, సీతంపేట, వీరఘట్టం మండలాల కెజిబివి విద్యార్థులకు స్థానిక కెజిబివిలో శనివారం 'పరీక్షలు మార్కులే జీవితమా' అనే అంశంపై జిల్లా కెరియర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ డి. సురేష్‌కుమార్ అవగాహన కల్పించారు. విద్యార్థులు చదవలేక కొందరు ఉద్యోగం రాలేదని, కొందరు ఓడిపోయామని మరికొందరు ఇలా ఎన్నో కారణాలతో బ్రతుకు భారం అనుకుని తొందరపాటు నిర్ణయాలతో జీవితాన్ని అర్థంతరంగా ముగిస్తున్నారని అన్నారు. ఇటువంటి నిర్ణయాలు తీసుకునే ముందు భవిష్యత్తును ఆలోచించుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు పరీక్షలు వారి ఉన్నత స్థితికి తీసుకువెళ్లే స్నేహితులుగా భావించాలని జీవితంలో పరీక్షలు అనేవి మెట్లు వంటివి అని, మన మార్కులు మన ప్రతిభను పూర్తిగా ప్రభావితం చేయలేవని చెప్పారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయుల సుజాత తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

ఈ నెల 21న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని కొత్తూరులో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో అటవీ, బంజర భూములను సర్వే చేసినా కొందరికి మాత్రమే పట్టాలు పంపిణీ చేశారని, ఇప్పటికైనా పూర్తి స్థాయిలో పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో జిల్లేడువలస, బోర్రపనుకువలస గిరిజనలు పట్టాలు ఇవ్వాలని పోరాటం చేసిన సందర్భంలో కలెక్టర్, ఉన్నతాధికారులు ఇచ్చిన హామీని స్థానిక రెవెన్యూ అధికారులు అమలు చేయలేదని, ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో సారిక, జిల్లేడు వలస, డొంకల వెలగవలస, కొటియా సరిహద్దు గ్రామాల అన్ సర్వేడు భూములను సర్వేలు చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21వ తేదీన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమములో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం సీనియర్ నాయకులు సుకురు గంగయ్య, మండల కమిటీ సభ్యులు చింత జోగయ్య, గేమ్మెల తిరుపతి, బాడమ్మ, చింతా లక్ష్మి పాల్గొన్నారు.


సాలూరు : గ్రామాల్లో ప్రచారం చేస్తున్న నాయకులు

కొమరాడ: ఈ నెల 21న సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద భూ సమస్యలపై చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. కూనేరు సంతలో శనివారం ధర్నా జయప్రదం చేయాలని కోరుతూ ధర్నాకు సంబంధించిన కరపత్రాల పంపిణీ చేసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సమస్యలను పరిష్కరించాలని కొమరాడ మండల ప్రజలు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి శనివారం వినతి అందించారు. కళ్ళికోట గ్రామానికి మంచినీటి సౌకర్యం, పరశురాంపురం గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయి, సిసి రోడ్డు, సైడ్ వాల్, లంజి గ్రామం నుండి కుంతేసు పంచాయతీ గూనకల్లుకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యలకు సంబంధించిన అధికారులకు తెలియజేసి పరిష్కార దిశగా చర్యలు చేపడతానని ఎమ్మెల్యే తెలిపారు.


ఎమ్మెల్యేకు వినతినందిస్తున్న గిరిజనులు

నియామక పత్రం అందజేత

కొమరాడ మండలం బట్టివానివలస గ్రామ అంగన్వాడి కేంద్రంలో మినీ అంగన్వాడి కార్యకర్తగా నియమించిన ఊయక లతకు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, నాయకులు రాఘవ, శ్రీకర్, అనంత్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీల ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడంపై అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తిరుపతిరావు హర్షం వ్యక్తం చేశారు. శనివారం అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక బెలగాం రైతు బజార్ సమీపంలో గల రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘ భవనంలో అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇవి నాయుడు, వి.తిరుపతిరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ సిఐడి అధికారుల రోజువారీ పనితీరు మెరుగుదలపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లా కమిటీలు క్షేత్ర స్థాయి బాధితుల సమస్యలను తెలుసుకొని తదనుగుణంగా బాధితులకు న్యాయం జరిగేలా అగ్రిగోల్డ్ ఆస్తులను చిన్న కమతాలుగా విభజించి ఖాతాదారులకు పంచడం ద్వారా, ఏదైనా వేలంలో పాల్గొన్న సంస్థలకు లేదా వ్యక్తులకు సకాలంలో అప్పచెప్పడం ద్వారా మేలు చేకూరుతుందని అన్నారు. అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్వీఎస్ కుమార్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలు సమర్థవంతంగా పనిచేసి భవిష్యత్ ఉద్యమ కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాలాపు అనంతరావు, బొబ్బిలి బ్రాంచ్ అధ్యక్షులు పి. ఈశ్వరనారాయణ పాల్గొన్నారు.

రాజీ లేకుండా పారిశుధ్య పనులు : కమిషనర్

ప్రజాశక్తి - సాలూరురూరల్

మున్సిపాల్టీ పరిధిలో గల పారిశుధ్య కార్మికులు రాజీ లేకుండా పారిశుధ్య పనులు చేయాలని, ఏ వార్డులో కూడా ఏ ఒక్కరి నుంచి పారిశుధ్య పనులు జరగడం లేదన్న ఫిర్యాదులు రాకుండా చూసుకునే బాధ్యత కార్మికులపై ఉందని మున్సిపల్ కమిషనర్ డిటివి కృష్ణారావు తెలిపారు. శనివారం ఉదయం నాయుడు వీధి, గొర్లి వీధి, వెలమపేట, గాడి వీధి, శ్యామలాంబ ఆలయం పరిసర ప్రాంతాల్లో మస్తర్లకు హాజరై పారిశుధ్య పనులను పరిశీలించిన ఆయన కార్మికులతో మాట్లాడారు. మరికొద్ది రోజుల్లో గ్రామ దేవత శ్యామలాంబ పండగ సందర్భంగా పారిశుధ్య పనులను కార్మికులు శ్రద్ధగా చేసి ఎక్కడా చెత్త కనిపించకుండా, ప్రజలకు ఇబ్బంది లేకుండా కృషి చేయాలని తెలిపారు. అనంతరం శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో పండగ దృష్ట్యా ఉత్సవ కమిటీ చైర్మన్ అక్యాన అప్పారావు, కమిటీ సభ్యులతో కలిసి పండగ జరుగు శ్యామలాంబ ఆలయం, నాయుడు వీధి సిరిమాను తిరిగే ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో 15,17 కౌన్సిలర్లు ద్వారపురెడ్డి పుండరీ కాక్ష్యనాయుడు, గుల్లిపిల్లి నాగేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎన్ రాజీవ్, శానిటరీ సెక్రెటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.9.66 లక్షల విలువైన ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు (సిడబ్ల్యుఎస్ఎన్) రూ.9.66 లక్షల సహాయ, ఉపకరణాలను రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్య పంపిణీ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్-ఎస్ఏ) కార్యక్రమాన్ని నిర్వహించారు. అలిమికో సహకారంతో ఎస్ఎస్ఎ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహించింది. రూ.9.66 లక్షల విలువైన చక్రాల కుర్చీలు, బ్రెయిలీ కిట్, సీపీ వీల్ చైర్లు, క్రచ్ ఎల్బో, రోలేటర్, ట్రైసైకిల్, వాకింగ్ స్టిక్, టీఎల్ఎం కిట్‌తో సహా దాదాపు 173 ఉపకరణాలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇటీవల కాలంలో భామినిలో రూ.26 లక్షల విలువైన సహాయ, ఉపకరణాలు పంపిణీ చేయడంతో పాటు అలిమ్‌కో సహకారంతో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గుర్తింపు శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

భూమి ఆరోగ్యమే.. మన ఆరోగ్యం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

భూమి ఆరోగ్యమే మన ఆరోగ్యమని రీజనల్ తీమోటిక్ లీడ్ కె. ప్రకాశ్ అన్నారు. మండలంలోని సంతోషపురంలో రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో నవధాన్యాలు సాగు ప్రాముఖ్యత గూర్చి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై ఏ విధమైన రసాయనిక ఎరువులు - పురుగు మందులు వాడకుండా సహజంగా లభించే వనరులను ఉపయోగించుకోవడం వల్ల మన ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు అనుకూలంగా పడుతున్నందున ఒక ఎకరానికి 25 నుంచి 30 రకాల నవధాన్యాలు, తొలకరి జల్లులు ముందు వేసుకోవడం వల్ల భూమి సారవంతం చెందడంతో పాటు ప్రధాన పంటకు అవసరమైన అన్ని రకాల పోషకాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగడానికి అవకాశం కలుగుతుందన్నారు. సహజంగా పండించిన ఆహార ఉత్పత్తులు వినియోగించడం వల్ల ఆరోగ్యంగా వుంటారని, నేటి పరిస్థితులలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అందుకు పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, తృణ ధాన్యాలు, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, ఆకు కూరలు, కూరగాయలు, తీగ జాతి మొదలగు రకాలు విత్తనాలు కలిపి వేసుకోవాలని అన్నారు. ఆరు తడి పంటలు శ్రీ పద్ధతిలో వరి, రాగులు, పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, వాణిజ్య పంటలు వేయడం వల్ల రైతులు త్వరితంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, మండల ఇంఛార్జి వి.పోలినాయుడు, డి.వెంకట్ నాయుడు, బ్రహ్మ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రీజనల్ తీమోటిక్ లీడ్ కె. ప్రకాశ్


నవధాన్యాల తయారీను పరిశీలిస్తున్న కె.ప్రకాశ్ తదితరులు

ఆర్‌బిఎస్‌కె రిఫరల్ వాహనం ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె)లో భాగంగా ఆరోగ్య లోపాలను (4డిఎస్) గుర్తించిన పిల్లల చికిత్సకు వైద్యారోగ్యశాఖ ద్వారా ఏర్పాటు చేసిన రిఫరల్ వాహనాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. పిల్లల్లో పుట్టుకతో, ఎదుగుదల క్రమంలో లోపాలు, వైకల్యాలను (4డిఎస్) త్వరగా గుర్తించాలని, తగు చికిత్స ద్వారా లోపాన్ని సరిచేస్తే జీవన ప్రమాణాలు మెరుగుపడడంతో పాటు, పిల్లలకు ఉజ్వల భవిష్యత్‌కు తోడ్పాటు అవుతుందన్నారు. జిల్లాలో వివిధ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇటువంటి లోపాలు గల 479 పిల్లలను గుర్తించామని, వారికి జిల్లా కేంద్రంలో గల బాలల సత్వర చికిత్సా కేంద్రంలో (డిఇఐసి) చికిత్స, ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌బిఎస్‌కె రిఫరల్ వాహనం ద్వారా వారికి ప్రయాస భారం తగ్గుతుందని, ఆరోగ్య కేంద్రాల నుంచి డిఇఐసి కేంద్రానికి పిల్లలను సత్వరమే తీసుకొచ్చి, చికిత్స అందించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ పిఎల్. రఘుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో మూడు రోజుల బూట్ క్యాంప్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ గేదెల నీలం నాయుడు ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి మూడురోజుల పాటు అటల్ టింకరింగ్ లాబ్స్ బూట్ క్యాంపు నిర్వహించారు. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి గిరడ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగాగా అటల్ టింకరింగ్ లాబ్‌లకు లక్షల రూపాయలు కేటాయిస్తుందని, కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు మంచి పరిష్కారం చూపే ప్రాజెక్టులను తయారు చేయాలని కోరారు. ఐటిడిఎ అకడమిక్ మోనటరింగ్ అధికారి కోటిబాబు మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో సీతంపేట మండలాలనికే 9ఎటిఎల్ ప్రభుత్వం కేటాయించారని అన్ని ప్రయోగ శాలలు మంచిగా పనిచేయాలని కోరారు. ఈ బూట్ క్యాంపు ద్వారా నేర్చుకున్న అంశాలను నిజ జీవితంలో ఉపపయోగపడేలా చూడాలని కోరారు. మండలంలో గల 7 అటల్ ల్యాబ్ పాఠశాలల నుంచి 40మంది విద్యార్థులు ఈ బూట్ క్యాంపులకు హాజరయ్యారు. నిపుణులైన మెంటార్స్‌చే కోడింగ్‌తో పాటు అర్డినో బోర్డు, బ్రెడ్ బోర్డులను వినియోగించే ప్రాథమిక పరిజ్ఞానం నేర్చుకుని 6డిఓఎఫ్ మెటాలిక్ రోబో, ఫైర్ డిటెక్షన్ సెన్సర్, డిస్టెన్స్ బేస్డ్ ఎల్ఇడి బ్లింక్, రైన్ డ్రాప్ సెన్సర్, మోషన్ సెన్సర్ ప్రాజెక్ట్ వంటి ప్రాజెక్టలను విద్యార్థులు స్వయంగా తయారుచేసి ప్రదర్శించారు. జిల్లా సైన్స్ అధికారి, ఎఎంఒ, ప్రిన్సిపల్ చేతుల మీదుగా బూట్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.